బీజేపీ నేతకు గవర్నర్ దత్తాత్రేయ పరామర్శ



అమీర్‌పేట: బీజేపీ నాయకుడు పి.సునిల్‌ను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. సునీల్ తల్లి శారద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గవర్నర్ ఆదివారం బీకే గూడలోని సునిల్ నివాసాకి వచ్చి శారద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు షాబాద్ శ్రీనివాస్‌రావు, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అలాగే కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.రమేష్‌కుమార్‌తో పాటు అలుమ్ని అధ్యక్షులు రాజమహేందర్ రెడ్డి, ప్రొ.వెంకటేశ్వర్లు, సచిన్ కులకర్ణి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

టీఎన్‌జీవోస్ కార్యవర్గంలో ఓయూ ప్రొఫెసర్‌కు చోటు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవోస్) కార్యవర్గంలో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొ.మల్లేశంకు చోటు లభించింది. ఆదివారం జరిగిన సమావేశంలో ప్రొ.మల్లేశంను టీఎన్‌జీవోస్ కేంద్ర ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరుగా కొనసాగుతున్న ఆయన రాష్ట్ర ఆల్ యూనివర్సిటీల టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వర్సిటీ అధ్యాపకుల సమస్యలతో పోరాడుతున్న ఆయన ఇక నుంచి గెజిటెడ్ ఆఫీసర్స్ సమస్యలపై కూడా పోరాడనున్నట్లు టీఎస్‌జీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆలేరుకు చెందిన దూడల వెంకటేష్ (45) ఇరవై ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి లాలాపేటలో నివసిస్తున్నాడు. డీటీపీ ఆపరేటర్ పనిచేస్తున్న వెంకటేష్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏడాది నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 21వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ లాలాపేట విజయ డెయిరీ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని రైల్వే పోలీసులు తెలిపారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం రెండో వార్డు సీబీఎస్ నగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గతంలో తాను సీబీఎస్‌నగర్‌లో బస్తీ పర్యటనకు వచ్చిన సందర్భంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు సమస్యలను బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇటీవలే డ్రైనేజీ సమస్యను పూర్తిచేసి, ఇకపై బస్తీలో రోడ్లు దెబ్బతినకుండా ఉండేలా సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. దశలవారీగా కంటోన్మెంట్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు బీజేపీ అధ్యక్షులు మదారపు అశోక్, నాయకులు శేఖర్, ఆనంద్‌చారి, మహేష్ , విజయ్, నరేందర్, హనుమంతు, కేబుల్ శీను పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు

ముస్తాబవుతున్న ఆంగ్లో ఇండియన్ చర్చి
- అన్ని మతాల వారికీ ఆహ్వానం
- ప్రతీ మంగళవారం సేవా కార్యక్రమాలు



మెట్టుగూడలోని సెయింట్ ఆంథోనీ చర్చి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలో పేరెన్నికగన్న పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఉన్నప్పటికీ ఆంగ్లో ఇండియన్ చర్చిగా ప్రత్యేకతను సంతరించుకుంది మెట్టుగూడలోని సెయింట్ ఆంథోనీ చర్చి. కొన్ని తమిళ కుటుంబాల వందేళ్ల ప్రార్థనలకు ప్రతిరూపంగానే ఈ చర్చి ఆవిర్భవించింది. క్రిస్మస్ వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ సుందరీకరణ పనులతోపాటు, వేడుకలకు హాజరయ్యే వేలాదిమంది భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్ల పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. సికింద్రాబాద్ ప్రాంతంలో చారిత్రాత్మక చర్చిలో ఒకటిగా ఉంటూ తనదైన ప్రత్యేకతలతో తన ఉనికిని చాటుకుంటుంది మెట్టుగూడ సెయింట్ ఆంథోనీ చర్చి. నగరంలో స్థిరపడిన 15 తమిళ కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రతీ మంగళవారం మెట్టుగూడ ప్రధాన రహదారి పక్కన సమావేశమై ప్రార్థనలు చేసుకునేవారు. 1925 నుంచి ప్రారంభమైన మంగళవారం ప్రార్థనలు నేటికీ కొనసాగుతున్నాయి.

భజన మండలితో ఆవిర్భావం..

ప్రనిద ఆంథోనియార్ భజనాయి కోడమ్ (సెయింట్ ఆంథోనీ భజన సంఘం) పేరుతో అప్పట్లో తమిళులు భజనలు చేసుకునేవారు. అప్పట్లో మోడీ సెంటర్‌గా పిలువబడే ఇప్పటి మెట్టుగూడ కూడలిలో సెయింట్ ఆంథోనీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని ఆరుబయటే భజనలు చేసేవారు. వారి భక్తిశ్రద్ధలను గుర్తించిన ఆస్ట్రేలియాలో స్థిరపడిన కార్లోపీటర్స్ అనే మహిళ తన నివాసాన్ని, ప్రాగణంలోని స్థలాన్ని చర్చి నిర్మాణం కోసం విరాళంగా అందజేసింది. 1972 ప్రాంతంలో చర్చి నిర్మాణం పనులు పూర్తి చేశారు.

ఆంగ్లో ఇండియన్ చర్చిగా..

క్లాట్‌పీటర్స్ అనే మహిళ నుంచి స్వీకరించిన స్థలంలో పారిస్‌కు చెందిన క్రైస్తవ మతగురువు బంధనమ్ జూలియన్ నేతృత్వంలో చర్చి నిర్మాణాన్ని చేపట్టారు. అప్పటి నుంచి నగరంలో స్థిరపడిన ఆంగ్లో ఇండియన్లు అందరు ఈ చర్చికి వచ్చి ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో సెయింట్ ఆంథోనీ చర్చిని ఈ ప్రాంత ప్రజలంతా ఆంగ్లో ఇండియన్ చర్చిగా పిలుస్తుంటారు. నేటికీ ప్రతీ మంగళవారం ఇక్కడ జరుగుతున్న ప్రత్యేక పూజలకు హాజరయ్యే ఆంగ్లో ఇండియన్లు అన్నదానం, వస్త్రదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ సందడి చేస్తుంటారు.

క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ వేడుకల పురస్కరించుకొని వారంరోజుల ముందు నుంచే సెయింట్ ఆంథోనీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగిస్తున్నారు. ఈనెల 18 నుంచే ఉదయం సాయంత్రం క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనలు కొనసాగిస్తున్నట్టు చర్చి నిర్వాహకులు తెలిపారు. ఈనెల 25 క్రిస్మస్ రోజున చర్చిలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళ భాషల్లో అనుగ్రహ భాషణలు, ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

అన్ని మతాల వారికి ఆహ్వానం..

క్రైస్తవులతోపాటు క్రైస్తవేతరులు కూడా తమ ప్రార్థనా మందిరానికి రావచ్చునని, ప్రపంచ శాంతి, మానవాళి సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేయవచ్చునని ఇక్కడి మత గురువులు ప్రచారం చేస్తుండడం గమనార్హం. దీంతో మతమార్పిడితో సంబంధం లేకుండా పలువురు క్రైస్తవేతరులు కూడా చర్చికి వచ్చి వెళుతున్నారు. ఇదిలా ఉండగా వారానికి ఒకరోజు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించి, అదేరోజు ఒకరి గృహంలో భజనలు సామూహిక భోజనాలు చేయడం వంటి కార్యక్రమాలను చర్చి నిర్వాహకులు నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం ఇప్పిస్తా

పరిహారం తేల్చాకే ప్రాజెక్టు పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రోడ్డు విస్తరణ బాధితులు

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ కోసం చేపట్టే విస్తరణలో భాగంగా నివాసాలు కోల్పోయే వారికి ప్రభుత్వం తగిన పరిహారం అందజేస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. జాతీయ రహదారి -44 మార్గంలో రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయే వారిని ఆదుకోవాలంటూ చిన్న తోకట్ట , బోయిన్‌పల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్లు కోల్పోతున్న వారికి ఎట్టి పరిస్థితులలోనూ నష్టం కలగకుండా తాను స్వయంగా ముఖ్యమంత్రి తో మాట్లాడి తగిన నష్టపరిహారం ఇప్పించే బాధ్యత తీసుకుంటానని బాధితులకు భరోసా ఇచ్చారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా మరోచోట ఇండ్లు కూడా కట్టించి ఇచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కలెక్టర్‌తో సహా ప్రభుత్వ అధికారులు అందరూ వచ్చి మాట్లాడి బాధితులకు న్యాయం జరిగిన తరువాతనే ప్రాజెక్ట్ ముందుకు వెళుతుందని, ఈలోగా ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే నమ్మి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. 1970లో అప్పటి కాంగ్రెస్ నాయకులు సంజీవయ్య చొరవతో తమకు ఈ ఇండ్లు వచ్చాయని అప్పటి నుంచి మూడు తరాలుగా తాము ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇప్పుడు ఎలివేటెడ్ కారిడార్ వలన తమ ఇండ్లు పోతున్నాయని తమను వేరే ప్రాంతానికి తీవ్రంగా నష్టపోతామని వాపోయారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థిక ప్రగతి సాధ్యం
- 'ఇందిరా మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి
- సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ



కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: మహిళల స్వయం ఉపాధితో ఆర్థికంగా పురోగతి సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని అర్హులైన మహిళలు సద్వినియోగపరచుకుని సాధికారత సాధించాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బేగంపేట డివిజన్ పాటిగడ్డ, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో మైనార్టీల కుటుంబాలకు ఇందిరా మహిళా శక్తి పథకంపై అవగాహనతో పాటు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీలో భాగంగా ఆన్‌లైన్ దరఖాస్తు శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శిబిరానికి హాజరైన మైనార్టీ మహిళలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుకు సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ... మహిళా సాధికారతతో ఒక్క ఆ కుటుంబానికి మాత్రమే కాదని సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అర్హులైన మహిళలందరికీ కుట్టుమిషన్లు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. విశాల్ సూదం మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మైనార్టీల అభ్యున్నతి, మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. మూడు నెలల పాటు కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాలకు నాయకులు బబ్లూ, నవాజ్, చిరంజీవి, హనీఫ్‌ఖాన్, నసీర్(అడ్డూ) కో ఆర్డినేటర్లుగా వ్యవహరించగా, నాయకులు రమేష్,, జాన్, మనోజ్‌కుమార్, మునీర్, తస్లీం, భూప్రా, మాధవి, సబా, అల్తమాష్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం : ఎమ్మెల్యే శ్రీగణేశ్



బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బొల్లారం బాల్ బ్యాట్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ పబ్లిక్ గార్డెన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అర్జుమన్‌రావు మెమోరియల్ ఒక రోజు బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులతో కాసేపు ముచ్చటించి బాల్ బ్యాట్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా సొంతమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల మీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. త్వరలోనే కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని మడ్‌ఫోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ దృష్ట్యా మరిన్ని ప్రాంతాల్లోనూ మినీ స్టేడియాలను ఏర్పాటు చేస్తామన్నారు. బాల్ బ్యాట్మింటన్ క్రీడను ప్రోత్సహించడానికి అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: వైద్య ఖర్చులు భరించలేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సంజీవనిలా పనిచేస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే స్థోమత లేని పేదవానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని అన్నారు. వైద్య అవసరాల నిమిత్తం సాయం కావాల్సిన పేదలు తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద జ్ఞానమాల కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

చిలకలగూడ: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని హైకోర్టు న్యాయవాది ఎద్దు దివాకర్ డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన నేతృత్వంలో సీతాఫల్‌మండి చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దివాకర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను హేళన చేస్తూ అమిత్‌షా మాట్లాడడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. కోట్లాది మంది అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగమే అమిత్‌షా వ్యాఖ్యలని ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్ఞానమాల ద్వారా మహిళలను చైతన్యపరుస్తున్న డీబీఎఫ్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ గృహ కార్మిక సంఘ ప్రతినిధులు వెంకటమ్మ, శశికళ, పార్వతి, కవిత, స్వాతి, చిత్ర, అనిత తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఇటీవల మోండా మార్కెట్‌లో ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు షాపులు కాలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. బాధితులు ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ... ఈ ఘటన బాధాకరమని విచారం వ్యక్తంచేశారు. బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సోమవారం అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శిస్తానని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, మహేష్‌యాదవ్, మహేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

లచ్చన్న విగ్రహావిష్కరణలో రాజకీయాలు తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: నూజివీడులో లచ్చన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రమేష్‌తో మాట్లాడినందుకు టీడీపీ ఎమ్మెల్యే శిరీషను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ క్షమాపణ చెప్పించడం సిగ్గుచేటని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విగ్రహావిష్కరణలో రాజకీయాలు చేయడం తగదని సూచించారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన బీసీ నాయకులు కలిసి మాట్లాడుకోవడాన్ని చూసి ఓర్వలేని సీఎం చంద్రబాబు కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఓట్లు, అధికారం కోసం బీసీ నేతలను ఉపయోగించుకునే చంద్రబాబు బీసీలు కలసి ఉంటే సహించలేకపోతున్నారన్నారు. బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తే టీడీపీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తో పీస్ కమిటీ సభ్యులు

అమీర్‌పేట: రూపాలు వేరైనా దేవుడు ఒక్కడేనని పీస్ కమిటీ వెస్ట్ జోన్ అధ్యక్షురాలు తేజోకుమారి, మహమ్మద్ మెహబూబ్ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణపై పీస్ కమిటీ చేస్తున్న సేవలను ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల పనితీరు, ఆలయాల వద్ద భద్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. అయితే కొందరు శాంతి భద్రతలకు భంగం కలిగించి మతాల మధ్య విద్వేషాలను రగల్చి లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారని ఆరోపించారు. అలాంటి చర్యల ఎవరూ ఉపేక్షించరని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పీస్ కమిటీ ఆల్ జోన్స్ సెక్రటరీ కృష్ణ శర్మ, సభ్యులు హనుమంత్‌రావు, భాస్కర్‌రెడ్డి, హబీబ్, జాకీర్, మహమ్మద్ అసదుద్దీన్, యూసుఫ్, రజత్ కుమార్, మహమ్మద్ ఖాజా, కృష్ణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 33, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరి బీర 55, క్యాబేజీ 18, క్యారెట్ 28, దొండ 45, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 43, ఉల్లిగడ్డ 35.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



ఎమ్మెల్సీ రామచంద్రరావు, మా జాతీయ అధ్యక్షుడు నరేంద్రకుమార్ కామరాజ్, సంస్థ ప్రతినిధులు డి.అనంతరాయ శర్మ, ప్రదీప్‌కుమార్, సత్యం శ్రీరంగం, ఆర్.సి.మూర్తి, జి.రవికుమార్, మురళీధర్, వెల్లాల అనురాధ, రామసుబ్రహ్మణ్యం, ఉమా పెరి, శిరీషా పుల్లె తదితరులు హాజరయ్యారు.

అమీర్‌పేట: మనం ఉద్యోగాల కోసం వెతుకులాట కంటే ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. సనాతన ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్ 7వ వార్షిక వ్యవస్థాపకత, యువజన సదస్సు, 2025వ సంవత్సర డైరీ ఆవిష్కరణ అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సనాతన సంస్థ వ్యవస్థాపకుల సంఘం వ్యవస్థాపకులు అమృత ముల్లపూడి, మాజీ మంత్రి వేణుగోపాలచారి, మాజీ

నీటి బిల్లులు మాఫీ చేయాలి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మండిపడ్డారు. ఆదివారం కాకాగూడ బాలాజీ కాలనీలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లా బిల్లు బకాయిలు చెల్లించాల్సిందిగా బోర్డు అధికారులు తమపై ఒత్తిడి చేస్తున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రామకృష్ణ మాట్లాడుతూ నల్లా బిల్లుల బకాయిల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బిల్లుల మాఫీ కోసం తాను ప్రయత్నిస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు అదనపు నీటి విడుదలకు రూ.24 కోట్లు చెల్లించాల్సిందిగా నోటీసులు పంపడం దారుణమన్నారు. నగర వ్యాప్తంగా ఉచిత నీటి పథకాన్ని అమలు చేస్తూ కంటోన్మెంట్‌కు మాత్రం బిల్లులు పంపడమేంటని ప్రశ్నించారు. కంటోన్మెంట్ తెలంగాణలో లేదా? కంటోన్మెంట్‌లో నివసిస్తున్నది రాష్ట్ర ప్రజలు కాదా? అని మండి పడ్డారు. గతంలో రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉండి కంటోన్మెంట్‌కు నయాపైసా కేటాయించలేదని, ఇప్పుడు సీఎంగా ఉండి అన్యాయం చేస్తున్నారని అన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని భూలక్ష్మీ అమ్మవారి ఆలయంలో జరత్కారు-మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సుప్రీం కోర్టు న్యా యవాది కళ్యాణ్ దిలీప్ సుంకర దంపతుల చేతుల మీదుగా గురు పండితుల పర్యవేక్షణలో సర్పసూక్త సహితంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రకాష్ నగర్, పాటిగడ్డ, మయూరిమార్గ్, భగవంతాపూర్ తదితర పరిసర ప్రాంతాల నుంచి భక్తు లు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కార్యక్రమం జరిగింది. భూలక్ష్మీ అమ్మవారి ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు నిర్వహించుకునే వారి జీవనోపాధికి ఇబ్బందులు కలిగించవద్దని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఆదివారం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, మోండాకు చెందిన పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. గడచిన మూడు దశాబ్దాలుగా తాము ఇదే ప్రాంతంలో పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసికుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఇటీవల మహంకాళి, గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు ఏసీపీ ఆదేశాలతో తమను వ్యాపారం చేసుకోనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేకు ఎమ్మెల్యే ఫోన్ చేసి వ్యాపారుల ఉపాధి దెబ్బతినకుండా, పాదచారులు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు నిర్వహించుకునేలా చూడాలని సూచించారు.

ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ



కిమ్స్ వద్ద మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రాంగోపాల్‌పేట్: తెలంగాణలో ఇక నుంచి బెనిఫిట్ షోలకు అనుమతినివ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను ఆదివారం ఆయన పరామర్శించారు. బాలుడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ... ఇలాంటి సంఘటనలు జరుగడం బాధాకరమని, పునరావృతం కాకుండా ఉండాలంటే బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదని అన్నారు. ఏపీలో కూడా చంద్రబాబు నాయుడు ఇలాగే నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి తన ఫౌండేషన్ ద్వారా రూ. 25 లక్షల ఆర్థిక సాయం బాలుడి కుటుంబ సభ్యులకు ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. లాభాల కోసమే సినిమాలు తీసి సామాజిక బాధ్యత లేకుండా కొంత మంది నటులు ప్రవర్తిస్తున్న తీరు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్, ఇ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీతేజకు అనిల్‌కుమార్ పరామర్శ

రాంగోపాల్‌పేట్: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజను రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుడి తండ్రి భాస్కర్‌తో కూడా మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇలాంటి సందర్భంలో రాజకీయ నాయకులైనా, సెలబ్రిటీలు అయినా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అల్లు అర్జున్ ప్రెస్ మీట్‌లో మాట్లాడే సమయంలో ఒక మహిళ మృతి చెంది, బాలుడు ఆస్పత్రిలో ఉంటే కొంచెమైనా మానవత్వం కనిపించ లేదన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.